# మూడు అక్షరాలు

(యథార్థం కంటె కల్పన మనోహరంగా వుంటుంది. కొందరు వ్యక్తులను గురించిన గాథలు, యథార్థాన్ని మించి అనేక వింతలు మనోహరమై, అవే నిజమైతే బాగా వుండేది అనిపిస్తాయి.)

పసిబిడ్డ ఏడ్పుతో ఆ యిల్లంతా ఒక్కసారి నిండిపోయింది. కొండెక్కుతుందేమోనని భయపెట్టి దీపం నిలబడి వెలగడం మొదలు పెట్టింది. ఇంతవరకు ఆదుర్దాతో బయట తార మాట్లాడుతున్న బ్రాహ్మడి ముఖంలో ఆనందం మెరుపై మెరిసింది. ముక్కోటి దేవతలకు మనస్సులో మ్రొక్కి వడి వడిగా అంగలు వేసుకుంటూ పురిటి గది దగ్గరకు వెళ్ళి,

"అవ్వా!" అంటూ పిలిచాడు.

"లోపలకు రావద్దు" అంటూ లోపల నుంచి అవ్వగారి ఆజ్ఞ వచ్చింది.

ముందుకు సాగిన అడుగు అక్కడే ఆగింది. ఒక్క క్షణం తటపటాయించి వెనక్కు తిరిగి, బయటకు వచ్చాడు.

ఇంతలో అవ్వగారు పురిటి గదిలోంచి బయటకు వచ్చి "మహారాజులాంటి మొగబిడ్డ" అని అంది. చేతులు జోడించి బ్రాహ్మణుడు ఆమెకు నమస్కారం చేశాడు. ఇతనివంక వాత్సల్యంతో ఒక్కక్షణం చూసి "వెయ్యేళ్ళు తండ్రి" అని దీవించి, పురిటి గదిలోకి వెళ్ళింది.

బిడ్డ జన్మ నక్షత్రం పరిశీలించిన సిద్ధాంతి "అదృష్టవంతుడివయ్యా! ఈ బిడ్డ నీ పేరు కలకాలం నిలుపుతాడు. విద్యలో నీ పుత్రుడు వాచస్పతి అవుతాడు" అని సెలవిచ్చాడు. ఆ సిద్ధాంతిని సత్కరించే స్తోమత యీ బ్రాహ్మడి దగ్గర ఎక్కడిది! తనకు మంచి మాట చెప్పిన యీ మిత్రుడికి అష్టైశ్వర్యాలు యిమ్మని భగవంతుడిని ప్రార్థించాడు.

తన బిడ్డ వాచస్పతి కావాలసిందే. ఆ శారదాంబ మన్ననల అందుకుని, తన తనయుడు తనలాగా దారిద్ర్యంలో బాధపడక మహా విద్వాంసుడై, సమస్త సుఖాలని పొందవలసిందే. అంటూ ఎన్నో మధుర స్వప్నాలని చూస్తూ ఆయన ఆ పసికందుకు 'వాచస్పతి' అని నామకరణం చేశాడు.

ఈ అడ్డాలలోని బిడ్డ పెరిగి పెద్దై, విద్యలో తనని అధిగమించి, తనని ఓడించే ఆ శుభఘడియలు చూసే ప్రాప్తిలేక, ఆ వ్యక్తి ఒకనాడు అంటే వాచస్పతి మూడు సంవత్సరాలు వయస్సునాడు అకస్మాత్తుగా అవతారం చాలించి విష్ణుసన్నిధి చేరాడు. తరతరాలు అనుభవించినా తరగని ఆస్తికాని, సంపదలుకాని తన యిల్లాలికి, ఆ యిల్లాలు కన్న బిడ్డకు ఇచ్చే అదృష్టం ఆయనకు ఎక్కడ? చివరకు మిగిలిందల్లా, యీనాడో రేపో నేలకూల సిద్ధంగావున్న జీర్ణ కుటీరం, తన బిడ్డ ప్రఖ్యాత పురుషుడు కావాలనే దీవన..... అంతే.

అటువంటి పరిస్థితులలో యింకొక స్త్రీ అయితే భయపడి బంధువుల పంచనే తలదాచుకుని బానిస బ్రతుకు బ్రతికి తన జీవితం తన బిడ్డ జీవితం నాశనం చేసుకుని వుండేది. ఆవిడ అల్లా భయపడి ఎక్కడికి పారిపోలేదు. "ఆ జగత్ రక్షకుడే నాకు అండ" అని నమ్మి జీవితశకంలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది.

ఉదయమే వాచస్పతికి అన్నం వండి పెట్టి ఊళ్లోకి వెళ్లి అక్కడి సంపన్నుల యిళ్లలో ఊడిగంచేసి ఈ రెండు జీవాలకు కావలసిన నిత్యావసరాలను సంపాదించేది. చూస్తుండగానే అయిదు సంవత్సరాలు కాలగర్భంలో విలీనమైయ్యాయి. వాచస్పతి యీనాడు ఎనిమిది సంవత్సరాల బాలుడయ్యాడు. ఆనాడే రెండు క్రోసుల దూరానవున్న గురువు సన్నిధిలో వేదాధ్యయనం మొదలు పెట్టాడు. తన ఆకుంఠిత భక్తి, పట్టుదల, నమ్రతతో గురువు మన్ననలకు పాత్రుడయ్యాడు. రెండు సంవత్సరాలు రెండు ఘడియలుగా గడిచిపోయాయి. ఒకనాడు గురువుగారి కోసం ఎవరో ఒక పండితుడు ఆశ్రమం వైపు వస్తున్నాడు. చుట్టు ప్రక్కల శిష్యులెవరూ కనపడలేదు. కాని ఎక్కడినుంచో అతి శ్రావ్యమైన కంఠమొకటి వేదపారాయణ చేస్తోంది. ఆ ధ్వనిని అనుసరించి వెళ్ళాడు. అనతి దూరంలో ఒక వృక్షచ్ఛాయను ఎవరో బాల బ్రహ్మచారి వేద పారాయణలో లీనమై యితని రాకనే గమనించలేదు. అతని ముఖంలోని వర్చస్సు, ఆ ముఖంలో నుండి తొంగిచూసే గాంభీర్యము, నిర్మలత్వమూ యీ అగంతకుని ఆకర్షించి అక్కడే నిలబడేటట్టు చేశాయి.

అతని మనస్సున వెలసిన ప్రశ్న- 'ఎవరా వటువు?'

హృదయంలో మెరిసిన సమాధానం- ఎవరో మహనీయుడు.

తన అంతస్థును మరచి యీ పసిబాలుణ్ణి, "స్వామీ! గురు దేవత లెక్కడ?" అని ప్రశ్నించాడు. కాని సమాధానం శూన్యం.

ప్రశ్నను ఒకటికి రెండు సార్లు రెట్టించినా సమాధానం రాకపోయే సరికి, “ఈ బాలుడు బధిరుడేమో” ననే శంక కలిగింది.

ఈ శంక నివృత్తి కాక పూర్వమే “మిత్రమా” అంటూ యింకొక కంఠం వినిపించింది. వెను తిరిగి చూసేసరికి గురువుగారు యిటు వస్తున్నారు. ఈ ఆగంతకుని చూడగానే “ఎన్నాళ్ల కెన్నాళ్లకు” అంటూ యీ వ్యక్తిని ఆలింగనం చేసుకున్నారు.

“మన వారందరకు కుశలమేగదా.”

“తమ దయవల్ల.”

“మన చిన్నారి భామతి?”

“అష్ట వర్షములు నిండినవి.”

“మరి యిహ అల్లుడెక్కడ?”

“లేకేమి లెక్కకు వున్నారు. కాని మా భామతి అందరి బిడ్డల వంటిది కాదు.”

“అని ప్రతి తండ్రి అనుకుంటాడు.”

“అతిశయోక్తి గాదు మిత్రమా! మా బిడ్డ విద్యలో నన్నుదాటి అప్పుడే అనేక యోజనాలు ముందుకు సాగింది. దాని జన్మ సాఫల్యం చెందాలంటే ఆమె కంటె రూపవంతుడు, విద్వాంసుడు ఆమెను చేపట్టాలి. తమ శిష్యకోటిలో ఆమెకు అపురూపుడైన వరుడు లభిస్తాడనే ఆశతో ప్రయాణమై యిటు వచ్చాను.”

“నీ ఆశయం నెరవేరుతుందిలే.”

“కావాలనే నా ప్రార్థన కూడా. భావి జామాతను చూడాలని మనస్సు వేగిర పడుతోంది.”

“చూస్తూనే వున్నావుగా.”

“ఎక్కడ స్వామీ?”

“ఎదుటనే.”

“ఎవరు? ఈ బాలుడా?”

“అవును. ఈ బాలుడు వాచస్పతి. నా శిష్యులలో శ్రేష్ఠుడు. అతనిని కారణజన్ముడేమోననిపిస్తుంది. నీ చిరంజీవికి యింతకంటె యోగ్యుడు ఎక్కడా లభించడు.”

“తమ ఆజ్ఞ.”

ఎనిమిది సంవత్సరాలు నిండిన భామతికి పది సంవత్సరాలు నిండని వాచస్పతితో వివాహమయింది. కాని యీ సంఘటన అతనిలో ఎట్టి మార్పూ తీసుకురాలేదు. బాల్యం గడచి యవ్వనం వచ్చింది. యవ్వన ప్రాంగణంలో పాదముంచే భామతి తన భావిజీవితం గురించి ఎన్నో మధుర స్వప్నాలు చూస్తూవుంటె సహాధ్యాయులు అనంగుడి విరిశరముల దాడికి డస్సి 'ప్రియే చారుశీలే' అంటూ విరహంలో తపిస్తు వుంటే వాచస్పతి మాత్రం యివేమీ తనకు సంబంధం లేనట్టు, యీ వసంత ఋతువులు, కోయిల పాటలు, మలయానిలం, తనకోసం కానట్టు వేదాంత గ్రంథపఠనలో లీనమై తననూ, తనవారలను విస్మరించి ఈ గ్రంథాలకు వ్యాఖ్య రాయాలనే సంకల్పానికి మనస్సున స్థానమిచ్చాడు.

"కొడుకూ కోడలు ఇంటికి వచ్చి యీ సంసార భారాన్ని వహిస్తారు. ఇన్నాళ్లుగా తను పడుతున్న యిడుములు దూరమై యిహనైనా శాంతి సౌఖ్యం లభిస్తాయి" అని తల్లి ఆశ పడింది. 'తోటివాళ్ల లాగా తాను కూడా భర్త యింటికి చీరా సారెతో వెడుతుంది. అక్కడ విద్వాంసుడైన భర్త, తల్లిని మించిన అత్తగారి నీడలో తన భావి జీవితం నిత్యమొక మధురస్వప్నంగా మారుతుంది' అని భామతి ఎన్నో తీయని కలలు గన్నది. కాని వాచస్పతి మాత్రం ఏదో మంత్ర ముగ్ధుడి లాగా అహర్నిశలు తన గ్రంథ పఠన మేదో, తన గ్రంథరచనమేదో దాంట్లోనే లీనమై ఇందరు వ్యక్తుల ఆశలు అడియాసలు చేశాడు.

కోడలిని తీసుకురమ్మని చెవినిల్లుకట్టుకు పోరినా ఫలించకపోయేసరికి ఆ యిల్లాలు "మన అదృష్టమింతే. కోరనోములు నోచినవారికి ఫలమెక్కడ? రతనాల రాశివంటి కోడలు నట్టింట నిలచినప్పుడు చూచే భాగ్యం మాకెక్కడ?" అని చింతించి, వగచి మనస్సు రాయి చేసుకుని తన పూర్వపంథానే తిరిగి అవలంబించింది. ఉదయమే లేచి వాచస్పతికి కావలిసిన సామగ్రిని సమకూర్చి ఊరిలోనికి పోయి సంపన్నుల యింట ఊడిగము చేసి సంసారము గడిపేది. ఒక్కొక్కసారి అలసటతో, చికాకుతో తన మనస్సులో అప్పుడప్పుడు "కోడలిని పిలిపించాలిసిందే! ఎన్నాళ్ల నేను యీ బాధలు పడను" అని అనుకుని వడివడిగా అంగలు వేసుకుంటూ తనయుడి దగ్గరకు వెళ్ళేది. తన సర్వస్వాన్ని మరచిన అతనిని చూడగానే నోట మాటరాక,

సంపన్నుల యింట బుట్టిన ఏకైక పుత్రిక మా భామతి ఈ దరిద్రుల యింట ఎలా సుఖపడగలదు" అని వాపోయేది.

"ఏమండీ! ఈ సంవత్సరమైనా మన చిన్నారిని అత్తవారింటికి పంపరా' అని తల్లి అడుగుతూ వుంటె తండ్రి ఏమంటాడో అని భామతి చాటున నిలబడి తన భాగ్యనిర్ణయం కోసం వేచి వుండేది.

"నా బిడ్డ నాకేం బరువుకాదు. అతగాడు వచ్చి భార్యను పంపమని అడిగితే కాని నేను పంపను. తీగకు కాయలు బరువా?"

"అలా అని యీడేరిన ఆడపిల్లను పుట్టింట ఎంతకాలం వుంచుకోగలం?'

"అతగాడు కన్నుతెరిచేదాకా."

ఈ మాట వినగానే భామతి హృదయాంతరాళంనుంచి ఒక నిట్టూర్పు వెలువడేది. తండ్రి మనసు తనకు తెలియనిదికాదు. తన భర్త దగ్గర నుంచి వర్తమానం రానిది ఈ యింట గడపదాటే హక్కు తనకు లేదు. తన భర్తను గురించి అప్పుడే అనేక రకాల వార్తలు వ్యాపించి తన చెవిని కూడా పడ్డాయి. తన భర్త ఉత్కృష్టమైన పనిచేస్తున్నాడు. ఆయన నీడనే ఉండి, వారికి చేదోడు వాదోడుగా నిలబడి సేవచేసే అదృష్టం తనకు వుందా?

బహుశ లేదేమో! లేకపోతే తన భర్త తనను ఎందుకు విస్మరిస్తాడు? తనలో లోపమేమని, అందగత్తెకాదా? తనకడ విద్వత్తు లేదా? సంపద లేదా? ఎందుకని ఈ ఉదాసీనతలు? ఎందుకీ నిర్లక్ష్యం?

ఒక వెన్నెలనాటి రాత్రి ఆ చిన్నదాని మనస్సున ఈ ప్రశ్నలు ఒకటికి వెయ్యి సార్లు మారుమ్రోగాయి.

సమాధానం? నిరాశతో నిండిన నిట్టూర్పు.

ఎన్నో యుగాలుగా ఎదురుచూసిన పర్వదినం ఆసన్నమయింది. కాని ఆ సంఘటనకు ఆ రోజున మాధుర్యం లేకపోయింది. వాచస్పతి తల్లి ఒక పర్వదినం నాడు తనువు చాలించి పతి సన్నిధి చేరింది. తల్లికి జరుగ వలసిన కర్మకూడా ఇతరుల సహాయంతో వాచస్పతి చేశాడు. ఏదో యాంత్రికంగా, తల్లి శ్రాద్ధ కర్మ జరిపించే కాని అతనికి ఈ విషయము ఏ మాత్రం స్మరణలో లేదు. ఎప్పుడు వెళ్ళి తన గ్రంథరచన కొనసాగిద్దామా అనే ఆదుర్దా మాత్రమే.

ఇంటి పొరుగున వున్న బ్రాహ్మణుడు వెళ్ళి భామతి తండ్రితో ముసలావిడ మరణించినట్లు చెప్పాడు. కాని ఆయనేమాత్రం చలించలేదు. పైగా వచ్చిన వ్యక్తిని "అమ్మాయిని పంపమని అల్లుడు మిమ్మల్ని పంపాడా" అని అడిగాడు.

"లేదు. ఆయనకు ఈ బాహ్యప్రపంచజ్ఞానమే వున్నట్లు లేదు. రేయింబవళ్లు తన పనిలో మునిగి వున్నాడు. తల్లి పోయిన విషయమే ఆయనకు గుర్తు వున్నట్లు లేదు."

"అలాగా! సరే మీరు వెళ్ళవచ్చు."

"మరి అమ్మాయిని పంపరా?"

"భార్య ఉనికినే మరచినవాని యింటికి నా బిడ్డను ఎలా పంపను? అతనంతట అతను వచ్చి అడిగినప్పుడు కాని పంపను."

అత్తగారి మరణవార్త విని కలతచెందిన భామతి యిహ వుండబట్టలేక,

"నేను వెడతాను నాన్నా" అని అంది.

"అతడు పిలవకుండానే వెడితే లోకులు ఏమనుకుంటారు?"

"ఇది లోకులకు సంబంధించిన ప్రశ్న కాదు. నా యింటికి నేను వెళ్ళడానికి ఒకరి యిష్టాయిష్టములతో పనిలేదు."

"మేమెవరం నీవెంట రాము."

"ఆయన అక్కడ ఒంటరివారై బాధలు పడుతూంటే నేను పుట్టింట కుడిచి కూర్చొని వుండలేను. మీరు ఎవ్వరూ రాకపోయినా సరే, నేను ఒంటరిగా వెళ్లగలను."

"స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః"

"కాదు నాన్నా! ఒక్కొక్కసారి ప్రణయాంతకం కూడా అవుతుంది."

తమ్ముడిని వెంటబెట్టుకుని భామతి అత్తవారింటికి వచ్చింది. తమ్ముడు మాత్రం సామాన్యుడా! అక్కను అత్తవారింటి గుమ్మం దగ్గర వదిలి, అభోజనంగానే తన వూరు వెళ్ళిపోయాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఇంట్లో ఒక మూల చిందర వందరగా వున్న సామానుల మధ్య వాచస్పతి కూర్చొని ఏదో రాసుకుంటున్నాడు. ఈ దృశ్యం చూడగానే భామతికి పరిస్థితి అర్థమయింది. వెంటనే నూతి దగ్గరకు వెళ్లి స్నానం చేసి తను తీసుకు వచ్చిన పదార్థాలతో వంటచేసి అతన్ని భోజనానికి రమ్మని పిలిచింది. ఇంతవరకూ రోజూ యిరుగు పొరుగు వాళ్లు వచ్చి వాచస్పతికి అన్నం పెట్టేవారు.

ఈ రోజు కూడా అల్లాగే అనుకున్నాడు. భామతి వచ్చిన విషయమే అతనికి తెలియదు. భోజనం పూర్తికావించి వాచస్పతి గ్రంథ రచనలో నిమగ్నుడైయ్యాడు. ఇంటికి వచ్చిన తరువాత ఒక్కసారైనా పన్నెత్తి పలుకరించక కన్నెత్తి చూడక పోయేసరికి భామతి మనము కించపడ్డ విషయం వాస్తవమే. 'బహుశ మాతృవియోగం వల్ల బాధపడుతున్నారేమో? తనని యింతవరకు పిలిపించనందుకు సిగ్గుపడి మాట్లాడలేక పోతున్నారేమో?' అని తనలో తనే సమాధాన పర్చుకుంది.

పగలు గడిచి రాత్రి వచ్చింది. రాత్రితో బాటు పిండి ఆరబోసినట్లు పండు వెన్నెల కూడా వచ్చింది. భోజనాల అనంతరం యిల్లు సర్ది, అలంకరించుకొని భామతి భర్తకోసం కనిపెట్టుకొని కూర్చుంది. ఆయనతో ఎన్నో విషయాలు చెప్పాలి.

ఇంత కాలం తనని పుట్టింటిలో వదలినందుకు మనస్సు నొచ్చేటట్లు మందలించ వలసిందే. లేత వెన్నెల నడిరేయిగా మారింది. భామతి చీమ చిటుక్కుమంటే భర్త వస్తున్నాడేమోనని ఎదురుచూస్తూ ఉన్నది. ఇంతకూ భర్త శయ్యాగృహానికి రాకపోయేసరికి, ఆయన కూర్చున్న తావుకు వెళ్ళింది. అక్కడ పుస్తకాల మధ్య అలసిసొలసి వాచస్పతి నిదురలో మునిగి వున్నాడు. అతనిని మేల్కొల్పడానికి ఒకటి రెండుసార్లు ప్రయత్నంచేసి సఫలం కాక చివరకు నిరాశతో డస్సి తను కూడా కొంగు పరుచుకుని కటిక నేలపై భర్తవున్న గదిలోనే నిదురపోయింది.

ఇల్లా కొన్ని రోజులు గడిచిపోయాయి. కాని వాచస్పతిలో ఎటువంటి మార్పూ రాలేదు. భామతి పుట్టింటి నుంచి తీసుకు వచ్చిన వస్తువులు పూర్తిగా అయిపోయాయి. ఇహ సంసారం నడిచే దెల్లా? భర్తను అడుగుదామనుకుంటే, ఆయన ధోరణి తెలుస్తూనే వుందాయే. చివరకు తను పూనుకుంటే కాని యీ సంసారం గడవదని భామతి గ్రహించింది. అత్తవారి లాగానే తనుకూడా ఉదయమే వాచస్పతికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసి ఊళ్ళోకి వెళ్ళి అక్కడ వూడిగం చెయ్యటం, తీరిఇక సమయాలలో రాట్నం మీద దారం తీసి వస్త్రాలు నేయించేది. భామతి శ్రమ వల్ల, ఆ సంసారం కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒకనాటి ఉదయం వాచస్పతి పనికి ఆటంకం కలిగింది. ఏదో ఒక సిద్ధాంతం ఆరోజు ఉదయం నుంచి అతని మనస్సును తికమక పెడుతోంది. ప్రయత్నం చేసినా సమస్య పరిష్కారం కావటంలేదు. చివరకు మధ్యాహ్నమయింది. ఎవరో ప్రౌఢ స్త్రీ వచ్చి భోజనానికి రమ్మని పిలిచింది. ఆ స్త్రీ సౌమ్యమూర్తి వంక చూసే సరికి ఆవిడ యెడల గౌరవ భావం కలిగి, "విదూషిమణిలాగా కనిపిస్తుంది. నా సమస్యను తీర్చగలదేమో!" నని అనుకుని తనను వేధిస్తున్న ప్రశ్నను అడిగాడు.

ఇన్ని సంవత్సరాలకు యీ విధంగానైనా భర్త తనను పలుకరించే సరికి భామతికి ఏనుగెక్కినంత సంతోషం కలిగింది. ఆనందంతో పెల్లుబికి మనస్సు, హృదయం ఒక్క క్షణం మూగపోయాయి. వాచస్పతి అడిగిన ప్రశ్నకు సులభంగానే సమాధానం చెప్పింది. ఈ సమాధానం అతన్ని సంతృప్తి పరిచింది. కృతజ్ఞతతో ఆవిడ వంక చూసి, మళ్ళీ తన పనిలో మునిగిపోయాడు.

ఆనాటి నుంచి వారి కార్యక్రమంలో మార్పు వచ్చింది. తనకు అనుమానం వచ్చిన విషయాలన్నీ ఒక తాటాకుమీద రాసి, వాచస్పతి యీ మిత్రురాలి కోసం వేచియుండేవాడు. భోజనం దగ్గర వారు విషయాలు చర్చించుకునేవారు.

అనేక వారాలు, నెలలు, వత్సరాలు యిల్లా గడిచిపోయాయి. చంద్ర గాడ్పులు, మంచుపోచలు, పండు వెన్నెలలు, నిండు పున్నములు ఎన్నో వచ్చాయి.

చివరికి యిరవై సంవత్సరాల అనంతరం ఒక పున్నమినాటి రాత్రి తన పరుగునుమాని కాలం ఒక్కగడియ ఆగింది. ఆ గడియలోనే వాచస్పతి తన జీవితమంతా ధారబోసి రచించిన మహాగ్రంథానికి భరతవాక్యం రాసి ఆనందంతో తన్మయుడై కూర్చొన్న శుభ ఘడియలలో తైలం నిండుకుని దీపం కొండెక్కింది. గదిలో అంతా నిశ్శబ్దం. కిటికీ గుండా వెన్నెల గదిలో పడుతోంది. ఆ గదిలో తనే కాకుండా యింకా ఎవరో ఉన్నట్టు అనిపించి వెనక్కు తిరిగి చూశాడు. తనకు వెనుకగా, ఎవరో ప్రౌఢ స్త్రీ నేలపై నిదురపోతోంది.

"ఎవరా స్త్రీ, ఎవరా సౌమ్యమూర్తి. ఆర్యనారి ఎవరు కూడా పర పురుషుని యింట నిదురించదే. బహుశః యీ స్త్రీ నా పత్నియా? ఈ ప్రశ్న రాగానే, తన వంటి వంక చూసుకున్నాడు. మెడలోని యజ్ఞోపవీతం తను వివాహితుడని తెలుపుతోంది. అవును! యిప్పుడిప్పుడే లీలగా జ్ఞప్తికి వస్తోంది. తనకు చిన్ననాడు వివాహమయింది. ఈ వ్యక్తి ఆ బాలికయేనా? "దేవీ" అంటూ ఆవిడను పిలిచాడు.

ఏదో మధుర స్వప్నంలో మునిగిన భామతికి కల నిజమయ్యే సరికి ఆనందంతో,

"స్వామీ" అని అంది.

"దేవీ! నీవు నా సహధర్మచారిణివా?" అని వాచస్పతి ప్రశ్నించాడు. మెడలోని మంగళ సూత్రాన్ని కళ్ళకద్దుకొని పతి పాదాలకు, మనసుకి మ్రొక్కి,

"అవును స్వామీ!" అని సమాధానం యిచ్చింది.

ఇది తెలిసే సరికి భార్య వంక చూసి,

"ఇంతవరకూ యీ విషయం నాతో ఎందుకు చెప్పలేదు. నీకు కావలసిన వన్నింటిని సమకూర్చవలసిన బాధ్యత నాపైన వుండగా యింతకాలం, యీ విషయం దాచావు. నా కర్తవ్యం నేను నిర్వర్తించకుండా ఎందుకు అరికట్టావు?" అని అడిగాడు.

భామతి తపస్సు యీనాడు ఫలించింది. తన భర్త తనన్ను గుర్తించాడు. అంతకన్నా కావలిసిన దేముంది? వల్లమాలిన సంతోషం పొందుతూ—

"స్వామీ! నేను తమ అర్ధాంగిని. శరీరంలో అర్ధభాగం లోకోపకారమైన పనిలో లగ్నమైనప్పుడు, దానిని పోషించే బాధ్యత రెండోభాగం మీద ఉంటుంది. నా కర్తవ్య పాలన నాకేం కష్టం కలిగించలేదు. మీరు చేసే పని ముందర నేను చేసినది చాలా స్వల్పం."

"అమ్మ ఏది?"

"విష్ణు సన్నిధి చేరారు."

"ఎప్పుడు?"

"ఇరవై సంవత్సరాల వెనుక."

"ఇరవై సంవత్సరాలా?"

"అవును స్వామీ."

తల్లి వార్త ఆయనకు చాలా దుఃఖం కలిగించింది. తనను నవమాసాలు మోసి, పెంచి పెద్దచేసిన తల్లి యీనాడు లేదు. కాని యీ దుఃఖం కంటేకూడా మనస్సున మెలిగిందల్లా ఒక్కటే చింత. భామతి ఋణం నుంచి విముక్తి పొందటం ఎల్లా? ఈ అనన్య సేవకు ఏమిస్తే సరిపోతుంది. తన కృతజ్ఞత ఎల్లా చూపించడం?

ఏదో ఆలోచన మనస్సున మెరిసింది. హృదయం ఆనందంతో నిండింది. గంటం చేతపట్టి తన గ్రంథం మీద ఏదో వ్రాసి భార్యకు చూపించాడు. ఆవిడ వల్లమాలిన ఆనందంతో, కృతజ్ఞత నిండే చూపులతో పతికి ప్రణమిల్లింది.

ఆ మానవుడు ఏం రాశాడో చూద్దామనే కుతూహలం, శశాంకుడి క్కూడా కలిగి, తన కోమల శీతల కరాలను ఆ గ్రంథరాజం పైకి సారించాడు. ఆ కావ్యానికి పేరుగా, త్రికాల మందు శాశ్వతంగా నిలచిన మూడు అక్షరాలు కనిపించాయి.... "భామతి."

(వాసంతికి కృతజ్ఞతతో)